## ప్రభుత్వ ఆసుపత్రిలో గదుల కొరత

**దారిలోనే సమావేశాలు.. ఇబ్బందుల్లో సిబ్బంది, రోగులు**



**నేటి సాక్షి, నారాయణపేట:** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో కనీసం ఉద్యోగుల సమావేశపు గది లేకపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన 'ఆశా డే' కార్యక్రమానికి ప్రత్యేక గది లేకపోవడంతో, గదులకు వెళ్లే దారిలోనే సమావేశాన్ని నిర్వహించాల్సి వచ్చింది. దీనివల్ల అటు విధుల్లో ఉన్న ఉద్యోగులకు, ఇటు చికిత్స కోసం వచ్చే రోగులకు రాకపోకలు సాగించడం ఎంతో కష్టతరంగా మారింది. జిల్లా స్థాయి అధికారులు తక్షణమే స్పందించి ధన్వాడ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక సమావేశపు గదిని మంజూరు చేయాలని ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు మరియు ఇతర వైద్య సిబ్బంది కోరుతున్నారు

## పదండి ఇంటి పన్ను కట్టుదాం

**ఇంటి పన్ను చెల్లించండి...పన్ను పై 5% మాఫీ పొందండి...**



**నేటిసాక్షి, మిర్యాలగూడ:** పట్టణవ్యాపార, వాణిజ్య, గృహా యజమానులు, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు 2026-27 ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నును వెంటనే మీప్రాంత బిల్ కలెక్టర్ లకు, వార్డు ఆఫీసర్స్ లకు మరియు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన కౌంటర్లలో లేదా https.cdma.cgg.gov.in.CDMA ARGS.CDMA _PG.Getp TDetails లాగిన్ ద్వారా చెల్లించాలని, పన్ను పై 5% మినహాహింపు అవకాశం ఉందని మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా, కమిషనర్ జి. శ్రీనివాస్ తెలిపారు. ఈ అవకాశాన్ని కేవలం తేదీ 30 వరకు మాత్రమే ఉన్నదని, ఇట్టి అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని, పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు.


## అంగన్వాడీ కేంద్రం తనిఖీ



**నేటి సాక్షి .చిలుకూరు:** చిలుకూరు మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్ 5 వ కేంద్రాన్ని పరిరక్షణలో భాగంగా ఈరోజు పిల్లల పోషణ నిమిత్తం గ్రామ సర్పంచ్ కొల్లు పుల్లమ్మ నాగయ్య తనిఖీ చేసి పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, హాజరు నమోదు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు విద్యా కార్యక్రమాలు వంటి అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం గర్భిణీ స్త్రీలకు అందుతుందనే అంశాన్ని పరిశీలించారు.మరింత మెరుగుదలకు అవసరమైన సూచనలు చేశారు. పిల్లల ఆరోగ్యం, అభివృద్ధి విషయంలో ఎలాంటి లోపాలు ఉండకూడదని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్ అల్లి ఉపేందర్ ,అంగన్వాడి టీచర్లు జయలక్ష్మి సిబ్బంది గర్భిణీ స్త్రీలు, బాలింత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీహన్సీకి జాతీయ అవార్డు

**గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఘన సత్కారం**



**నేటి సాక్షి, జగిత్యాల :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామానికి చెందిన బాలిక శ్రీహన్సీ భరతనాట్యంలో విశేష ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి అవార్డును సొంతం చేసుకుంది. ఇటీవల కరీంనగర్‌లో ఘనంగా నిర్వహించిన భరతనాట్యం కాంపిటీషన్స్ ఉగాది పురస్కారాల్లో భాగంగా ఆమె ఈ ప్రతిష్టాత్మక అవార్డును కైవసం చేసుకుంది. గ్రామానికి చెందిన ధోమ్మాటి రాము, హారిక దంపతుల కుమార్తె అయిన శ్రీహన్సీ చిన్న వయసులోనే జాతీయ స్థాయిలో రాణించి గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శ్రీహన్సీ సాధించిన ఈ విజయాన్ని పురస్కరించుకుని అబ్బాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో పాలకవర్గం ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు గ్రామ కార్యదర్శి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కళా రంగాల్లో ఇలాంటి ఉన్నత శిఖరాలను అధిరోహించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, తల్లిదండ్రులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హోంగార్డుల జీవితాలు 'ఉడిగం' చేసేవేనా..



- ఉద్యోగ భద్రత కరువు.. సెలవు తీసుకుంటే వేతనంలో కోత
- సీఎం రేవంత్ రెడ్డి, డీజీపీ సజ్జనార్ తమను ఆదుకోవాలని విన్నపం

**నేటి సాక్షి, నారాయణపేట:** తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న హోంగార్డుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయి. గత పదేళ్లుగా ఫ్రెండ్లీ పోలీసింగ్ పేరుతో పాలకులు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు తప్ప, తమను మాత్రం పట్టించుకోలేదని నారాయణపేట జిల్లా హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వందలాది మంది హోంగార్డులు వివిధ పోలీస్ స్టేషన్లలో రాత్రింబవళ్లు శ్రమిస్తున్నా, వారికి కనీస గుర్తింపు గానీ, ఉద్యోగ భద్రత గానీ లేదని వాపోతున్నారు. కుటుంబ సభ్యులకు అనారోగ్యం చేసినా, అనివార్య కారణాలతో ఒక్కరోజు విధులకు హాజరుకాకపోయినా దాదాపు వెయ్యి రూపాయల వరకు వేతనంలో కోత విధిస్తున్నారని వారు ఆవేదన చెందుతున్నారు. 20 ఏళ్లుగా పని చేస్తున్నా అర్హతకు తగ్గ ప్రమోషన్లు రావడం లేదని, సెలవులు కూడా ఉండటం లేదని పేర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కారణాలతో మరణించిన సుమారు 300 మంది హోంగార్డుల కుటుంబాలకు నేటికీ ఎలాంటి ప్రభుత్వ ఆర్థిక సాయం అందలేదని తెలిపారు. హోంగార్డులకు ప్రభుత్వ పోలీసులతో సమానంగా హక్కులు కల్పించాలని, పని భద్రత కల్పించాలని వారు కోరుతున్నారు. నూతన డీజీపీ సజ్జనార్ గారు చొరవ తీసుకుని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నెలకు గౌరవప్రదమైన వేతనంతో పాటు కరువు భత్యం (డీఏ), పీఎఫ్ (గ్రాఫీ) సౌకర్యాలు కల్పించాలని, తమ పిల్లలకు ఉచిత విద్య, ఇందిరమ్మ ఇళ్ల వసతి కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నారాయణపేట జిల్లా హోంగార్డులు వేడుకుంటున్నారు.

# ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి



- రైతులకు ఇబ్బంది కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి
- సన్న రకానికి రూ. 500 బోనస్.. ఏ-గ్రేడ్ ధాన్యానికి రూ. 2389 మద్దతు ధర

**నేటి సాక్షి, వికారాబాద్:** వికారాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పౌర సరఫరా సంస్థ ఆధ్వర్యంలో యాసంగి (రబీ) 2025-26 ధాన్యం కొనుగోళ్లపై సన్నాహక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ పాల్గొని అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రైతులు పండించిన ప్రతి గింజా కొనుగోలు చేయాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఏ-గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,389, సాధారణ రకానికి రూ. 2,369 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ప్రత్యేకంగా సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ఇచ్చే రూ. 500 బోనస్ రైతులకు అందుతుందని స్పష్టం చేశారు. వేసవి దృష్ట్యా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే, సరిపడా టార్పాలిన్లు, తూకం యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు మరియు గోనె సంచులను అందుబాటులో ఉంచాలన్నారు. 17 శాతం కంటే తక్కువ తేమ ఉన్న ధాన్యానికి టోకెన్లు ఇచ్చి సేకరించాలని సూచించారు. సన్న, దొడ్డు రకం ధాన్యాన్ని గుర్తించేందుకు వీలుగా ప్రత్యేక ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, వాటి తరలింపునకు విడివిడిగా వాహనాలను సమకూర్చాలని తెలిపారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రైతుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి, డీఆర్డీఓ శ్రీనివాస్, డీఏఓ రాజారత్నం, మార్కెటింగ్ అధికారి రియాజ్ మరియు మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పేదల సొంత ఇంటికల నెరవేర్చిన ఘనత...కాంగ్రెస్ ప్రభుత్వానిదే



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని పేదల సొంత ఇంటికల నెరవేర్చిన ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఎమ్మెల్యే బిఎల్ఆర్ అన్నారు. మండల పరిధిలోని కోడెబండ తండా కి చెందిన లబ్ధిదారుల భూక్యా బిక్షం- రోజా నూతన ఇందిరమ్మ ఇళ్ళు లు ను మంగళవారం శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు వారి కుటుంబ సభ్యులు, ప్రజా ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పాటైనా రెండున్నర సంవత్సరాలలో, మన మిర్యాలగూడ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి, పేద కుటుంబాల సొంత ఇంటి కలను నెరవేర్చామని అన్నారు. అతిత్వరలోనే మిర్యాలగూడ పట్టణంలో కూడా 2500 ఇళ్లకు శ్రీకారం చుట్టబోతున్నామని, గత ప్రభుత్వంలో పేద ప్రజల సంక్షేమం పక్కకు పెట్టి, కమిషన్ ల కోసం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందని,. ప్రజా ప్రభుత్వంలో పేద కుటుంబాలకు సన్నబియ్యం, నూతన రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక సంక్షేమాలను పేద ప్రజలకు అందించి వారి ఆశీర్వాదాలు అందుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కోసం కొట్లాడ్తే అరెస్టుల





- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి.

**నేటి సాక్షి వికారాబాద్ :** ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల రైతుల భూములను తీసుకునే కుట్ర చేస్తున్న నేపథ్యంలో, నేడు కళాపూర్ రాపోలు రైతులను పరామర్శించడానికి వారికి అండగా ఉంటాం అని తెలపడానికి తెలంగాణ మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు వస్తున్ నేపథ్యంలో, మంగళవారం మాజీ మంత్రులు హరీష్ రావు గారిని సబితా ఇంద్రారెడ్డి గారిని హౌస్ అరెస్ట్ చేయడం వికారాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలను , దీ=హా పార్టీ నాయకులను ఎక్కడ పడితే అక్కడ అరెస్టుల పర్వం చేసిన ప్రభుత్వానికి ,పోలీసులకు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు... ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుక ఉండొద్ద అని, పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ప్రశ్నించారు....రైతుల పక్షాన పోరాటని సిద్ధంగా ఉంటాం అని, నోటిఫికేషన్ రద్దు చేసే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం అని నేడు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ గారితో కలిసి ధరూర్ లో జరిగిన ప్రెస్ మీట్ లో వెల్లడించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ఈ కార్యక్రమం లో బీ ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# చౌడేపల్లిలో విషాదం ఈతకు వెళ్లి వ్యక్తి మృతి





- గంగ జాతర పూట మృత్యువాత

**నేటి సాక్షి, చౌడేపల్లి:** అన్నమయ్య జిల్లా చౌడేపల్లి మండలంలో ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో మునిగి మృతి చెందిన ఘటన మంగళవారం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు మరియు అగ్నిమాపక శాఖ అధికారుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చారాల పంచాయతీ ఓదులపేటకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి (37) తిరుపతిలో తన భార్యతో కలిసి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. చౌడేపల్లిలో జరుగుతున్న గంగ జాతరను పురస్కరించుకుని పొదలపల్లిలోని తన పెద్దమ్మ ఇంటికి వచ్చిన ఆయన, మంగళవారం మధ్యాహ్నం చిట్టిరెడ్డిపల్లి చెరువు కిలేరు సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో స్నేహితులతో కలిసి



ఈతకు వెళ్లాడు. అందరూ కలిసి ఈత కొడుతుండగా, చంద్రశేఖర్ రెడ్డి అకస్మాత్తుగా నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు వెంటనే బావిలోకి దూకి వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై చిన్న రెడ్డప్ప వెంటనే స్పందించి పుంగనూరులోని రెస్క్యూ టీంకు సమాచారం చేరవేయగా, వారు సంఘటనా స్థలానికి చేరుకుని సుమారు అరగంట పాటు శ్రమించి మృతదేహాన్ని వెలికితీశారు. రెస్క్యూ టీం సభ్యులు సుబ్రహ్మణ్యం, లోకేష్ రెడ్డి, సురేష్ బాబు, ప్రకాష్, ఆనంద్‌లు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. సమాచారం అందుకున్న చుట్టుపక్కల గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బావి వద్దకు చేరుకున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. జాతర పూట జరిగిన ఈ ప్రమాదంతో మృతుని కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# మాజీ ఎంపీపీపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

- నిందితులపై 307 సెక్షన్ నమోదు చేయకుంటే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- ఎంపీ డీకే అరుణ ఎందుకు నోరు మెదపడం లేదు?: బొదిగెలి శ్రీనివాస్ ప్రశ్న

**నేటి సాక్షి, నారాయణపేట:** నారాయణపేట జిల్లా కృష్ణా మండలం చేగుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ లింగప్పపై అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు చేసిన దాడిని బాహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) తీవ్రంగా ఖండించింది. నిందితులపై హత్యా యత్నం (307) సెక్షన్ కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మరికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎస్సీ కులానికి చెందిన మాజీ ఎంపీపీపై అకారణంగా దాడి చేసి చంపే ప్రయత్నం జరిగినా, స్థానిక ఎస్సై రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి నిందితులకు కొమ్ముకాయడం అత్యంత దుర్మార్గమన్నారు. ఘటన జరిగి పది రోజులు గడుస్తున్నా నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రాజకీయ లబ్ధి కోసం పార్లమెంటులో మాట్లాడే స్థానిక ఎంపీ డీకే అరుణ గారు, ఈ ఘటనపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు. ఎస్సీ కులాలు మీకు కేవలం ఓట్లు వేసే యంత్రాలు మాత్రమేనా అని ప్రశ్నించారు. రాజకీయ నాయకుల మెప్పు కోసం చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న పోలీసు అధికారుల తీరును ఆయన తప్పుపట్టారు. తక్షణమే నిందితులను అరెస్టు చేయకుంటే జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కృష్ణా ఎస్సైని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న రెవెన్యూ సమస్యలు పరిష్కరించండి

### ఆర్డీఓకు డీవీఎంసీ మెంబర్ విన్నపం

**నేటి సాక్షి, ఆత్మకూరు:** ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని నందికొట్కూరు మరియు శ్రీశైలం నియోజకవర్గాల్లో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) మెంబర్ లింగాల నాగరాజు కోరారు. మంగళవారం ఆయన కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓ సి. వెంకట శివను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా లింగాల నాగరాజు మాట్లాడుతూ.. గతంలో పనిచేసిన అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక రెవెన్యూ ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోయాయని, దీనివల్ల రైతులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓ గారు ప్రత్యేక చొరవ చూపి ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# ఫీజు వసూళ్లపై హైకోర్టు తీర్పు బాధాకరం



- బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** తెలంగాణ రాష్ట్రంలో పేద విద్యార్థులు అందరూ ప్రభుత్వం ఇచ్చే ఫీజు రియంబర్స్మెంట్ పై ఆధారపడి చదువుకుంటున్న సందర్భంలో, రాష్ట్ర హై కోర్టు పేద విద్యార్థుల ఫీజులు నేరుగా వారే చెల్లించుకోవాలని తీర్పు ఇవ్వడం బాధాకరమని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థులతో మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ అందించే ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ ల పై ఆధారపడి విద్యని అభ్యసిస్తున్న సందర్భంలో, ప్రభుత్వం విద్యార్థులకు రూ. 6,500 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకుండా, విద్యార్థులను మానసిక శోభకు గురి చేస్తున్నారని, కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వ నుంచి అందే ఫీజు రియంబర్స్మెంట్స్ ,స్కాలర్షిప్ అందకపోవడంతో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో పేద విద్యార్థులు చదువుకునే స్వేచ్ఛ పరిస్థితి లేకుండా పోయిందని, బడుగు బలహీన వర్గాలను అడుగడుగునా అణచివేస్తున్న సందర్భం ప్రజలందరూ గమనిస్తున్నారని ఆయన అన్నారు. త్వరలోనే తిరుగుబాటు మొదలవుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, గంగాధర్, రమేష్, ఉదయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖలో వికారాబాద్‌కు ఉత్తమ అవార్డులు

- మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రశంసా పత్రాల అందజేత



**నేటి సాక్షి, వికారాబాద్:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి ఉత్తమ అవార్డులను కైవసం చేసుకుంది. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో భాగంగా, వివిధ విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన జిల్లా సిబ్బందికి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు మరియు మెమెంటోలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ పురస్కారాలను ప్రకటించారు. ముఖ్యంగా వికారాబాద్ జిల్లాలోని తాండూరు రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (RBSK) టీంకు, అలాగే జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణ కొరకు నిరంతరం శ్రమిస్తున్న ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్ (ICTC) విభాగాలకు వారి ఉత్తమ సేవలకు గాను ఈ గౌరవం దక్కింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (ఇవీనూ) డాక్టర్ డి. స్వర్ణకుమారి, ఆర్బీఎస్కే మరియు ఐసీటీసీ సిబ్బంది పాల్గొని మంత్రి చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. జిల్లాకు ఈ స్థాయి గుర్తింపు రావడం పట్ల వైద్య ఆరోగ్య శాఖాధికారులు మరియు సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# క్రికెట్ కిట్ పంపిణీ



**నేటి సాక్షి, జగిత్యాల:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రంలోని నల్లగుట్ట యువకులను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు గొల్లపల్లి 7వ వార్డు సభ్యురాలు ముస్కు రవళిక శ్రీపాల్ రెడ్డి ముందుకు వచ్చారు. మంగళవారం ఆమె తన సొంత ఖర్చులతో క్రీడాకారులకు అవసరమైన క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత ఆరోగ్యంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప సర్పంచ్ గురజాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం అభినందనీయమని కొనియాడారు. తమకు క్రికెట్ కిట్ అందజేసి ప్రోత్సహించినందుకు నల్లగుట్ట శ్రీ రాజరాజేశ్వర యూత్ సభ్యులు మరియు క్రీడాకారులు ముస్కు రవళిక శ్రీపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు, స్థానిక క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూసార పరీక్షలతో శాస్త్రీయ సాగుకు ఊతం




**నేటి సాక్షి, ఎండపల్లి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గుల్లకోట రెవెన్యూ పరిధిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో భూసార పరీక్షల కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఐదు మట్టి నమూనాలను సేకరించారు. సేకరించిన నమూనాలను మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. భూసార పరీక్షలు రైతులకు ఎంతో ఉపయోగకరమని, భూమి పరిస్థితులకు అనుగుణంగా ఎరువులు వినియోగిస్తే అనవసర ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం సేకరించిన మట్టి నమూనాలను కరీంనగర్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు. ఈ పరీక్షల ద్వారా భూమి సారాన్ని అంచనా వేసి రైతులకు తగిన ఎరువుల వినియోగంపై సూచనలు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ లావణ్య, వార్డు సభ్యులు బిసగోని తిరుపతి, మూల ప్రశాంత్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు గోనె సంతోష్, లింగంపెల్లి లచ్చయ్య మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# డా.మునీర్ జన్మదిన వేడుకలు

### జనయేత్రీ ఫౌండేషన్ సేవలు అద్భుతం ఎమ్మెల్యే బిఎల్ఆర్



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ప్రపంచ ఆరోగ్య దినోత్సవం మరియు జనయేత్రీ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మునీర్ పుట్టినరోజు వేడుకను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనయేత్రి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ మునీర్ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ మునీర్ గారి పిలుపుమేరకు యువతి, యువకులు 50 మందికి పైగా రక్తదాతలు ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి అవార్డు గ్రహీత సాజిదా ఖాన్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, డిఎస్పీ రాజశేఖర్ రాజు పాల్గొని, డాక్టర్ మునీర్ తకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసి, పుచ్చకాయ కట్ చేపించి, వారి సేవ కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిలుకూరి బాలు, మరియు గాయం ఉపేందర్ రెడ్డి, హజారుద్దీన్, తపకొప్పుల సైదులు, ఫౌండేషన్ సభ్యులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# సుబ్లేడులో ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం








- ఆశా వర్కర్లకు సన్మానం
- ఆరోగ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించిన మెడికల్ ఆఫీసర్ వసుంధర
- ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ సంగబత్తుల స్వాతి సుమన్ రెడ్డి

**నేటి సాక్షి, తిరుమలాయపాలెం:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుంధర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సంగబత్తుల స్వాతి సుమన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ.. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతిరోజూ కనీసం 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా బీపీ, మధుమేహం, ఊబకాయం మరియు గుండె జబ్బుల బారి నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలను ప్రజల చెంతకు చేర్చడంలో ఆశా వర్కర్ల పాత్ర ఎంతో కీలకమని ఆమె కొనియాడారు. వారి సేవలను గుర్తించి ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆశా వర్కర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ సిలర్ సాహెబ్, ఎస్సై కూచిపూడి జగదీష్, ఉపసర్పంచ్ భూక్య అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# మొక్కులు తీర్చుకున్న రాఘవేంద్ర రెడ్డి

## నియోజకవర్గ క్షేమం కోసం ప్రార్థన



**నేటి సాక్షి,మంత్రాలయం:** మంత్రాలయం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి కుటుంబ సమేతంగా ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని, తమిళనాడులోని అరుణాచలం శ్రీ అరుణాచలేశ్వర స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తిరుమల మరియు అరుణాచలం వంటి పవిత్రక్షేత్రాల దర్శనం జీవితంలో ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కోసం ప్రత్యేకంగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రాంత అభివృద్ధి వేగవంతం కావాలని, ప్రజల సంక్షేమం మరింత మెరుగుపడాలని దేవుని దయ కోరుకున్నట్లు చెప్పారు. అలాగే ప్రజలందరూ ఐక్యంగా ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. దేవుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ దర్శనం తనకు మానసిక ప్రశాంతతను ఇచ్చిందని, ప్రజల సేవలో మరింత కృషి చేయాలనే సంకల్పాన్ని బలపరిచిందని ఆయన తెలిపారు.

# కాంగ్రెస్ నాయకుల సస్పెన్షన్

## ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలతో చర్యలు





**నేటి సాక్షి, గన్నేరువరం:** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలంలోని పారువేల్ల గ్రామానికి చెందిన ఇద్దరు కాంగ్రెస్ నాయకులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముసుకు ఉపేందర్ రెడ్డి ప్రకటించారు. గ్రామానికి చెందిన చెక్కిళ్ల తిరుపతి గౌడ్ మరియు బోడ నరసింహారెడ్డి పార్టీలో ఉంటూనే కాంగ్రెస్ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పనిచేస్తూ, పార్టీకి నష్టం చేకూరుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వీరి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను గుర్తించిన మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ సస్పెన్షన్ వేటు వేసినట్లు వెల్లడించారు. ఈ ప్రకటన వెలువడినప్పటి నుండి సదరు వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని, పార్టీ శ్రేణులు మరియు ప్రజలు గమనించాలని ఆయన పత్రికా ముఖంగా తెలియజేశారు.

# విధులు వదిలి 'పంచాయితీ'లకు తెరలేపుతున్న సెక్రెటరీలు

- పనులు చక్కదిద్దాలని ఆదేశిస్తే ఏకంగా మండల బాస్‌పైనే ఫిర్యాదులు
- జిల్లా స్థాయి అధికారి అండదండలతో సెక్రెటరీల ఇష్టారాజ్యం



**నేటి సాక్షి, తిమ్మాపూర్:** గ్రామాల్లో ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులను పర్యవేక్షించాల్సిన పంచాయతీ సెక్రెటరీలు కొత్త పంచాయితీలకు తెరలేపుతున్నారు. తిమ్మాపూర్ మండలంలో విధులు నిర్వహిస్తున్న కొందరు సెక్రెటరీలు తమ బాధ్యతలను విస్మరించి, గ్రూపు రాజకీయాలకు ప్రాధాన్యత ఇస్తుండడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా స్థాయి అధికారి ఒకరి అండదండలు పుష్కలంగా ఉండడంతో, మండల ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించిన మండల బాస్‌పైనే కొందరు సెక్రెటరీలు ఏకంగా ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడం గమనార్హం. "మాకు పనులు చెప్పడానికి మీరెవరు?" అనే స్థాయికి వీరి ప్రవర్తన చేరినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అధికారులే ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ, పై అధికారులపైనే ఫిర్యాదుల పర్వానికి తెరలేపడం మండలంలో కలకలం రేపుతోంది. నిజానికి, సెక్రెటరీలంతా తమ విధులను వదిలి బ్యాచ్‌లుగా విడిపోయి ఇందిరానగర్ గ్రామంలో అడ్డాలు వేస్తున్నట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ విషయంపై మండల ఉన్నతాధికారి వివరణ కోరగా, ఈ తతంగం అంతా బయటపడినట్లు సమాచారం. జిల్లా బాస్ వెనకుండి ఈ వ్యవహారాన్ని నడిపిస్తుండడంతోనే సెక్రెటరీలు ఇంతలా బరితెగిస్తున్నారని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. పనులు ఎగ్గొట్టేందుకు సెక్రెటరీలు పన్నుతున్న ఈ వ్యూహాల పట్ల ప్రజలు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ 'పంచాయితీ' రాజకీయాలకు ముగింపు పలకాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# హత్య కేసులో నిందితుడు అరెస్ట్

## ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ వెల్లడి



**నేటి సాక్షి, కొమరం భీం ఆసిఫాబాద్:** తిర్యాణి మండలం పిట్టగూడ గ్రామానికి చెందిన హన్మంతరావ్ హత్య కేసులో నిందితుడిగా ఉండి, పోలీస్ కస్టడీ నుండి తప్పించుకున్న రాయిసిడం వినోద్ కుమార్‌ను పోలీసులు ఎట్టకేలకు తిరిగి అరెస్ట్ చేశారు. మంగళవారం రెబ్బెన సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్ ఈ వివరాలను వెల్లడించారు. గత ఏడాది నవంబర్ 1న, మంత్రాలు చేస్తున్నాడనే అనుమానంతో హన్మంతరావ్‌పై వినోద్ కుమార్ గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. అప్పట్లో నిందితుడిని అరెస్ట్ చేయగా, కస్టడీలో ఉన్న సమయంలో అతను పోలీసుల నుండి తప్పించుకుని పరారయ్యాడు. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు రెండు ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. నిరంతర నిఘా మధ్య మంగళవారం గోలేటి ఎక్స్ రోడ్ ఆటో స్టాండ్ వద్ద నిందితుడిని పోలీసులు తిరిగి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన రెబ్బెన సీఐ సంజయ్, తిర్యాణి ఎస్సై వెంకటేష్, రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

# రైతులను మిల్లర్లు ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు



- ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కల్పించాలి : ఎమ్మెల్యే బిఎల్ఆర్

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** ధాన్యం దిగుమతిలో రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బిఎల్ఆర్ అన్నారు. గత రాత్రి రైతులకు, మిల్లర్లకు మధ్య జరిగిన వాగ్వాదం నేపథ్యంలో నిలిచిపోయిన ధాన్యం కొనుగోళ్లు అధికారుల జోక్యంతో మళ్లీ మొదలయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్పీ రాజశేఖర్ రాజ్ మంగళవారం మిల్లర్లతో జరిపిన అత్యవసర చర్చలు సఫలమయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ రైస్ మిల్లర్ల తో మాట్లాడుతూ, మిల్లుల వద్ద నిలిచిపోయిన ధాన్యం ట్రాక్టర్లను వెంటనే ఖాళీ చేయించి, కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారును, మిల్లర్లను ఆదేశించచారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర తప్పకుండా అందేలా చూడాలని, ధరల విషయంలో రైతులకు నష్టం కలగకూడదని స్పష్టం చేశారు. అన్నదాతలతో మిల్లర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి ఘర్షణలకు తావులేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని, రైతులను ఇబ్బందులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధికారుల ఆదేశాలకు మిల్లర్లు సానుకూలంగా స్పందించి, తక్షణమే కొనుగోళ్లు చేపడుతున్నట్లు ప్రకటించారు. దీంతో హైవేపై ధర్నా చేస్తున్న రైతులు తమ నిరసనను విరమించి మిల్లుల వద్దకు చేరుకున్నారు. వర్ష సూచన ఉన్న నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం కావడంతో రైతుల్లో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో రైస్ మిల్లుల అసోసియేషన్ నాయకులు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఒకరి ప్రాణం ఆగింది ముగ్గురికి జీవం ఇచ్చింది

- అపఘాతంలో బ్రెయిన్ డెడ్ - అవయవ దానం
- కుటుంబ సభ్యుల మానవతా నిర్ణయం
- 'ఎక్స్'లో సీపీ సజ్జనార్ సెల్యూట్ పోస్ట్



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన మాసిపెద్ది నారాయణరావు (69) గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అనంతరం బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించబడగా, ఆయన కుటుంబ సభ్యులు అవయవ దానం చేసి మానవతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే ఈ నెల 2వ తేదీన సాయంత్రం నారాయణరావు తన ఇంటి నుంచి పొలానికి వెళ్తుండగా అంబారీపేట స్టేజ్ సమీపంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం గమనించిన స్థానికులు వెంటనే స్పందించి కుటుంబ సభ్యుల సహాయంతో ఆయన్ను సమీప ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ గాయాల తీవ్రత అధికంగా ఉండటంతో పరిస్థితి విషమించింది. పలువురు నిపుణుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగించినా, చివరకు నారాయణరావును బ్రెయిన్ డెడ్‌గా మంగళవారం వైద్యులు నిర్ధారించారు. ఈ పరిణామంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయితే మానవతా దృక్పథంతో భార్య రాణి, కుమారులు రఘుపతిరావు, రాకేష్‌రావు అవయవ దానం చేయాలని నిర్ణయించారు. జీవన్ దాన్ సంస్థను సంప్రదించి వైద్యుల సహకారంతో హైదరాబాద్ జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రిలో రెండు కిడ్నీలు, లివర్‌ను దానం చేశారు. ఈ అవయవ దానం ద్వారా ముగ్గురు వ్యక్తులకు కొత్త జీవితం లభించినట్లు వైద్యులు తెలిపారు. ఒకరి ప్రాణం ఆగిపోయినా ముగ్గురికి జీవం ఇచ్చిన ఈ ఘటన మానవతకు నిదర్శనంగా నిలిచింది. ఇదిలా ఉండగా, "ప్రాణం పోయినా మరో ముగ్గురి రూపంలో జీవిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన నారాయణరావు గారికి, వారి కుటుంబం సాహసోపేత నిర్ణయానికి అభినందనలు. అవయవ దానం చేసినందుకు నా సెల్యూట్" అంటూ హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సజ్జనార్ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. విషాదం లోను కుటుంబ సభ్యుల మానవత నిర్ణయంపై స్థానికులు, ప్రజాప్రతినిధులు సైతం ప్రశంసలు కురిపిస్తున్నారు.